
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 85 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 9, దేవతలు భగవంతుణ్ణి శరణు వేడటం

క్రితం నెల వ్యాసంలో ఇంద్రుడు విశ్వరూపుడి మూడు తలలూ ఖండించాక కోపంతో త్వష్ట ప్రజాపతి చేసిన హోమంలోంచి వృత్రాసురుడు పుట్టడం, వాడు దేవతల మీదకి యుద్ధానికి వెళ్ళడం చూశాం.

మత్త. అట్టి వృత్రునిమీఁద దేవత లల్కతోఁ బెనుమూఁక లై
చుట్టిముట్టి మహాస్త్రవిద్యలు చూపి యేపున నేయ నా
గొట్టువీరుఁడు వార లేసిన క్రూరశస్త్రము లన్నియుం
జుట్టి పట్టుక మ్రింగి శూరత జోక నార్చె మహోగ్రుఁడై. [6-321]

ఇలా తమమీదకి వచ్చిన వృత్రాసురుడిమీదకి దేవతలందరూ తమ శస్త్రాస్త్రాలు ప్రయోగించారు. వృత్రుడు ఈ ఆయుధాలన్నింటినీ ఓ పట్టుతో పట్టుకుని గుటుక్కున మింగి దేవతల మీదకి వచ్చాడు. దీని అర్ధం ఏమంటే, మన మంచి గుణాలు బాగా నీరసించి పోయినప్పుడు చెడు గుణాలనేవి విజృభించి మిగిలిన మంచి గుణాలని మింగితే మనకి ఏమీ మిగలదు. అప్పుడు మనం చేసేదేమీ ఉండదు కనక, మిగిలిన పని భగవంతుణ్ణి శరణు వేడుకోవడం.

మనం చేసినవన్నీ చేసి అదంతా పీకలమీదకి వచ్చాక 'మహాప్రభో తప్పు అయిపోయింది రక్షించు' అని అడిగితే భగవంతుడు 'నీ కర్మ నువ్వు అనుభవించు, నాకేం?' అంటాడా లేకపోతే ఆదుకుంటాడా? ఈ విషయానికి రామకృష్ణుల శిష్యులైన మహేంద్రనాథ్ గుప్తాగారు సమాధానం చెప్తారు. మనకి ఏదో చెడు రాసిపెట్టి ఉందనుకోండి మనం చేసిన కర్మకి. నిజమైన పశ్చాత్తాపంతో భగవంతుణ్ణి శరణువేడితే చెడు జరగడం మాత్రం తప్పదు కానీ, ఆ జరిగేది బాగా తగ్గుతుంది అంటారు ఆయన. ఇది శ్రీ రామకృష్ణులు అనేకసార్లు శిష్యుల విషయంలో నిరూపించినదే. విశ్వరూపుడి తలలు ఖండించిన పాపానికి – వృత్రాసురుడు వచ్చి దాడిచేసాక, తెల్సింది ఫలితం. అందువల్ల మిగిలిన పని శరణాగతి. అయితే ఒక విషయం. మనం అన్ని తప్పులు చేస్తూ ఉన్నా మనకి భగవంతుడు, శరణు అనగానే ఎందుకు సహాయం చేయాలి? ఎందుకంటే మనం ఆయన సంతానం కాబట్టి, కంచెర్ల గోపన్న చెప్పినట్టు ఆయన "...దాశరధీ కరుణాపయోనిధీ" కాబట్టి అని అనుకోవాల్సినదే.

వ. ఇట్లు సర్వసాధనంబులతోడ సాధుజనంబుల వృత్రాసురుండు మ్రింగిన, నచ్చరుపడి చేయునది లేక తత్తేజోవిశేష విభవంబునకు భయంబు నొంది, కందిన డెందంబునం గుందుచుం, బురందర ప్రముఖు లార్తరక్షకుండగు పుండరీకాక్షునకుం గుయ్యిడు వారలై.

[6-323]

అలా వృత్రాసురుడు దేవతల ఆయుధాలన్నీ మింగే సరికి ఆశ్చర్యపడి, వాడి తేజో విశేషాలకి భయం పుట్టి ఆర్తరక్షకుడైన (ఆర్త = భయం చెందినవారు) పుండరీకాక్షుడి దగ్గిరకి బయల్దేరారు.

లగ్రా. వీఁడు కదు దుర్దముఁడు వాఁడి మన కైదువులు;
పోఁడి చెడఁగా మెసఁగి యీదు గనకున్నాఁ;
డేడ బ్రతుకింకఁ? బెనుకీడు పొడమెన్ మనకుఁ;
దోడుపడ నొక్కరుఁడు లేఁడు హరి దక్కన్;
వేఁడుదము శ్రీధరునిఁ; గూడుదము సద్భటులఁ;
బాడుదము గీతముల; జాడఁపడు నంతన్
వీఁడు చెడు త్రోవ దయతోడ నెఱిగించు ఘనుఁ;
డోడక సురాలయము పాడుపడ దింకన్. [6-324]

క. అని తలపోయుచుఁ దమలో
మునుకుచుఁ దికమకలు గొనుచు మురరిపు కడకున్
గునుకుచుఁ దినుకుచుఁ నేగిరి
ఘనరాక్షసుఁ గన్న కన్నుఁగవ బెగ్గిలఁగన్. [6-325]

పై పద్యం ఏ వృత్తమో గమనించారా? లయగ్రాహి. ఇది సీస పద్యంలా కనిపించినా సీసం కాదు. మన ఆయుధాలు అన్నీ ప్రయోగించాం (మన చేతనైనది చేయగలిగాం, ఇంకేమీ చేయలేని స్థితి వచ్చింది కనక), వీడు అజేయుడు (దుర్దముడు) కనక ఇంక మనకి మిగిలినదేమిటంటే నారాయణుడి దగ్గిరకి పోవడమే; ఆయన తప్ప మరొకరు మనకి సహాయం చేసేవారెవరూ లేరు (తోడుపడు నొక్కరుడు లేడు హరి దక్కన్). అలా మనసులో వృత్రాసురుడికి బెదురుతూ భగవంతుడి దగ్గిరకి చేరారు. అలా తన దగ్గిరకి వచ్చినవాళ్లతో ఆయన ఏమంటాడు? తండ్రి/తల్లి తప్పుచేసిన పిల్లలు తప్పు ఒప్పుకుని ఏడుస్తూ వస్తే ఏమంటారు?

వ. ఇట్లు భయార్తులై యమర్త్యవ్రాతంబు చనిచని ముందట నభంగ భంగ రంగ దుత్తుంగ డిండీర మండల సముద్దండాడంబర విడంబిత నారాయణ నిరంతర కీర్తిలతా కుసుమగుచ్ఛ స్వచ్ఛంబును, అనవరత గోవింద చరణారవింద సేవా సమాకుల కలకలఫలిత మహాపుణ్య ఫలాయమాన సముద్దీపితావర్తవర్తిత దక్షిణావర్త రుచిర శంఖమండల మండితంబును, నతినిష్ఠుర కఠిన పాఠీన పృథురోమ రాజిసంకుల తిమి తిమింగిల కర్కట కమఠ కచ్ఛప మకర నక్ర వక్రగ్రహ గ్రహణ ఘుమఘుమారావ దారుణగమన విషమిత విషమ తరంగఘట్టన ఘట్టిత సముద్ధూత శీకర నికర నీరంధ్ర తారకిత తారాపథంబును, మహోన్నచ్ఛ్రయ శిలోచ్చయ శిఖరాగ్ర ప్రవహిత దుగ్ధనిర్ఝర సమ్మార్జిత పురాణపురుష విశుద్ధ శుద్ధాంత విహరణధురీణ నవవసుధాధౌత ధావళ్య ధగద్ధగాయమాన రమ్య హర్మ్య నిర్మాణ కర్మంబును, నతి పవిత్రగుణ విచిత్ర నిజకళత్ర ప్రేమానంద సందర్శిత ముకుంద పరిస్రవదంతరంగ కరుణారస పరిమిళిత భావబంధుర విద్రుమ వల్లీమతల్లి కాంకుర శోభితంబును, ప్రసిద్ధ సిద్ధరసాంబువాహ సంగమ సముత్థిత గంభీర ఘోష పరిదూషిత సకల రోదోంతరాళంబును, సముద్రమేఖలాఖిల ప్రదేశ విలసిత నవీన దుకూలాయమానంబును, హరిహర ప్రముఖ దేవతానిచయ పరిలబ్ధామృత మహైశ్వర్య దానధౌరేయ మహానిధానంబును, వైకుంఠపుర పౌరవర కామ్యఫలఫలిత మందార పారిజాత సంతాన కల్పవృక్ష హరిచందన ఘన వనానుకూలంబు నునై యొప్పుచుఁ గుబేరు భాండాగారంబును బోలెఁ బద్మ, మహా పద్మ, శంఖ, మకర, కచ్ఛప, ముకుంద, కుంద, నీల, వర సమగ్రంబై,

విష్ణు కరకమలంబునుం బోలె సుదర్శనావర్త ప్రగల్భంబై, కైలాస మహీధరంబునుం బోలె, నమృతకళాస్థాన శేఖరపదార్పణంబై, యింద్ర వైభవంబునుం బోలెఁ గల్పవృక్ష, కామధేను, చింతామణి జనితంబై, సుగ్రీవసైన్యంబునుం బోలె నపరిమిత నిబిడ హరిసంచారంబై, నారా యణోదరంబునుం బోలె నఖిల భువన భారభరణ సమర్థంబై, శంకరు జటాజూటంబును బోలె గంగాతరంగిణీ సమాశ్రయం బై, బ్రహ్మలోకంబునుం బోలె బరమహంసకుల సేవ్యంబై, పాతాళ లోకంబునుం బోలె ననంత భోగి భోగయోగ్యంబై, నందనవనంబునుం బోలె నైరావత మాధవీ రంభాది సంజననకారణంబై, సౌదామినీ నికరంబునుం బోలె నభ్రంకషంబై, విష్ణునామకీర్తనంబునుం బోలె నిర్మలస్వభావంబై, క్రతు శతగతుండునుం బోలె హరిపదభాజనంబై యొప్పుచున్న దుగ్ధవారాశి డాసి, శ్వేతద్వీపంబున వసియించి, యందు సకల దిక్పాలకాది దేవతలు దేవదేవు నాశ్రయించి యిట్లని స్తుతియించి; రంత.

[6-326]

ఈ వచనం చదివితే పోతన రాసినట్టే ఉంది కదా? ఇది విష్ణులోకంలో ఉండే భగవంతుడి గురించి వివరణ. ఈ మొత్తం వచనం అంతే పోతన రాసినట్టే ఒకే ఒక వాక్యం. ఇలా నారాయణుడి దగ్గిరకి వచ్చిన దేవతలు భగవంతుణ్ణి వేడుకుంటున్నారు తమని కాపాడమని.

చ. ఉదకమయంబునన్ వసుధ నోడగఁ జేసి తనర్చు కొమ్మునన్
వదలక యంటఁగట్టి మనువల్లభుఁ గాచిన మత్స్యమూర్తి స
మ్మదమున మమ్ము బ్రోచు ననుమానము మానఁగ వృత్రుచేతి యా
పద దొలగించి నేఁడు సురపాలుర పాలిటి భాగ్య దైవమై. [6-328]

భూమి మొత్తం నీటిలో మునిగినప్పుడు (ఉదకమయుంబునన్) మత్స్యావతారంలో తన కొమ్ముతో సత్యవ్రతుడితో సహా సప్తరుషులని రక్షించిన మమ్మల్ని వృత్రాసురుడి బారినుండి ఆపదలని తొలగించి కాపాడాలి. ఎలా కాపాడాలంటే – సురపాలుర పాలిటి భాగ్య దైవమై.

మత్త. రంతు చేయుచు వాతధూత కరాళ భంగుర భంగ దు
ర్దాంత సంతత సాగరోదక తల్ప మొంది వసించు బ
హ్మంతవానిని బొడ్డుదమ్మిని నాఁచి కాచిన నేర్పరిం
తంతవాఁ డనరాని యొంటరి యాదరించు మముం గృపన్. [6-329]

ప్రళయకాలంలో అన్నీ నీటిలో మునిగినప్పుడు, ఆ నీటినే తల్పంగా చేసుకుని నివసిస్తూ, బ్రహ్మని తన పద్మంలో ఉంచుకుని రక్షించిన నేర్పరి, ఇంతవాడు అంతవాడు అని చెప్పలేని వాడైన ఒంటరి (అంటే అద్వితీయుడు) మమ్మల్ని కృపతో ఆదరించాలి. ఈ పద్యంలో కల్పాంతకాలంలో కూడా నిత్యుడూ శాశ్వతుడూ అయిన భగవంతుడి గురించి చెప్తున్నాడు. భగవద్గీతలో చెప్పినట్టూ ఆయన లేని ప్రదేశం లేదు. నేను అందరిలో ఉన్నాను కానీ అందరూ నాలో లేరు అని చెప్పటంలో అర్థం కూడా ఇదే – ఇంతింత వాడనరాని యొంటరి.

తే. దేవతలమైన మే మిట్టి దేవదేవు
సర్వలోక శరణ్యుని శరణు చొచ్చి
బలితమైనట్టి వీని యాపదలఁ బాసి
మీఱి శుభములఁ జేకొనువార మిపుడు. [6-330]

దేవతలమైనా ఇప్పుడు కష్టాలవల్ల దేవదేవుణ్ణి శరణుకోరడానికి వచ్చాము. ఎందుకంటే భగవంతుడు సర్వలోక శరణ్యుడు కనక, ఆపదలని తొలగించేవాడు కనక. గమనించారా? మనుషులకి ఉన్నట్టే సురాసురలకి కూడా ఈ కష్టాలు తప్పవు. ద్వందాతీతాలకి అతీతమైనప్పుడే భగవంతుణ్ణి చేరుకోగలం. అప్పుడే పూర్తి సుఖ, సంతోష, ఆనందాలు లభించేది. అసలు ఈ పాప పుణ్యాలకీ కర్మలకీ అతీతమైనవాడు కనకే ఆయన భగవంతుడు.

వ. ఇట్లు జగన్మోహనాకారుండయిన నారాయణుని కృపావలోక నాహ్లాద చకిత స్వభావ చరితులై సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి ఫాలభాగ పరికీలిత కరకమలులై యిట్లనిరి. [6-334]

దేవతలు ఇలా ప్రార్ధన చేసేసరికి నారాయణుడు కనిపించాడు. ఓ చిన్న విషయం. దేవతలు ముందు వైకుంఠానికి వెళ్ళాక అక్కడ విష్ణువు ఉంటాడు కదా? వెళ్ళగానే కనిపించడా? అసలు భగవంతుణ్ణి చూడడానికి వైకుంఠానికి వెళ్లడం దేనికి, భగవంతుడు సర్వత్రా ఉన్నప్పుడు? దీనికి సమాధానం ఏమంటే భగవంతుడు సర్వత్రా ఉన్నాడు సరే, కానీ ఆయన కనిపించడానికి మనకి శరణాగతి ఏదీ? అందుకే హిరణ్యకశిపుడు వైకుంఠానికి వెళ్ళినప్పుడు అక్కడ విష్ణువు కనపడడు. దేవతలకి కూడా ఈ పరిస్థితుల్లో మొదట శరణాగతి లేదు, అందువల్ల ఆయన గురించి స్పృహలేక విశ్వరూపుణ్ణి సంహరించాడు ఇంద్రుడు. బ్రహ్మహత్యాపాతకం చుట్టుకున్నప్పుడు తెల్సి వచ్చింది, వైకుంఠానికి వెళ్ళారు. వెళ్ళగానే కనిపించాడా భగవంతుడు? మనం హిరణ్యాక్షుడిలా ఉన్నంతకాలం ఆ గర్వం తగ్గనంతవరకూ మనకి భగవంతుడు ఎక్కడకి వెళ్ళినా కనిపించడు. వెళ్ళాక కాళ్లా వేళ్ళాపడి అయ్యో ఇంతపని చేసాను తప్పు అయింది, అని మనసులో నిజంగా పశ్చాత్తాపం రాగానే కనిపిస్తాడు.

అందువల్ల వైకుంఠానికి వెళ్ళి ఇలా అయింది మాకు "నీవే తప్ప నితః పరంబెరుగని... కావవే రక్షింపు భద్రాత్మకా" అన్నప్పుడు "మా-త్ర-మే" ఆయన కనిపిస్తాడు. ఎలా కనిపిస్తాడు? జగన్మోహనాకురుండై; 'చూసావా నన్ను చేరుకోవడం ఎంత సులువో, నీ గర్వం అణుచుకోవడం, అనన్య శరణాగతి రావడం ఎంత కష్టమో' అని అడుగుతున్నట్టు నవ్వుతూను. ఇదే మనం గజేంద్రమోక్షంలో చూసాం.

ఉ. చిక్కిరి దేవతావరులు చిందఱ వందఱలైరి ఖేచరుల్;
స్రుక్కిరి సాధ్యసంఘములు; సోలిరి పన్నగు లాజి భూమిలో;
మ్రక్కిరి దివ్యకోటి; గడు మ్రగ్గిరి యక్షులు వృత్రుచేత నీ
చిక్కినవారి నైన దయచేయుము నొవ్వకయుండ నో! హరీ! [6-337]

ఇప్పుడు దేవతలు చెప్తున్నారు వాళ్ల బతుకులు ఎలా తయారయ్యాయో. దేవతలు చిక్కిపోయారు వృత్రాసురుడి చేతికి. ఖేచరులు (కిన్నెరలు) చిందర వందరైపోయారు, నాగులు భూమిలో దాక్కోవల్సి వచ్చింది. అలా పోగా మిగిలినవాళ్లం ఇలా వచ్చాం; మమ్మల్ని ఏదోవిధంగా రక్షించాలి.

తే. అకట! దిక్కుల కెల్ల దిక్కైన మాకు
నొక్క దిక్కును లేదు కాలూనఁ నైన;
దిక్కుగావయ్య! నేఁడు మా దిక్కుఁ జూచి
దిక్కు లేకున్నవారల దిక్కు నీవ. [6-339]

అష్టదిక్కులకీ అధిపతులమైన మాకు దిక్కులేకుండా పోయింది ఈ రోజున. అందువల్ల దిక్కులేని మా కేసి చూసి ఓ దిక్కు (దారి) చూపించు, ఎందుకంటే దిక్కులేనివారికి నువ్వే దిక్కుకదా?

క. నీ దిక్కు గానివారికి
నే దిక్కును లేదు వెదక యిహపరములకున్
మోదింపఁ దలఁచువారికి
నీ దిక్కే దిక్కు సుమ్కు; నీరజనాభా! [6-340]

నీ వైపు చూసి (నీ దిక్కుగానివారికి) నువ్వే దిక్కని మొక్కనివారికి ఇహపరాల్లో ఏ దిక్కూ లేదు. అందువల్ల నీరజనాభా, (నాభిలో పద్మం ఉన్నవాడు, నారాయణుడు) ఇహపరాల్లో సుఖం కావాలనుకునేవారికి, నువ్వే దిక్కు.

పై రెండు పద్యాలు చదివాక ప్రహ్లాదోపాఖ్యానంలో హిరణ్యకశిపుడు కొడుకుతో అన్న పద్యం గుర్తు రాక మానదు. అక్కడ తండ్రి ఏమంటున్నాడో చూడండి. నీకెవరురా దిక్కు అని అడుగుతున్నాడు.

క. దిక్కులు గెలిచితి నన్నియు
దిక్కెవ్వఁడు? రోరి! నీకు దేవేంద్రాదుల్
దిక్కుల రాజులు వేఱొక
దిక్కెఱుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్. [7-261]

దీనికి ప్రహ్లాదుడి దీటైన సమాధానం వింటే ఆశ్చర్యం కలుగుతుంది.

క. దిక్కులు కాలముతో నే
దిక్కున లేకుండుఁ గలుగుఁ దిక్కుల మొదలై
దిక్కుగల లేని వారికి
దిక్కయ్యెడు వాఁడు నాకు దిక్కు మహాత్మా! [7-265]

అండదండలు ఉన్నవాళ్లకీ లేనివారికీ (దిక్కుగల లేనివారికి) కూడా భగవంతుడే దిక్కు. సింగయ పోతనగారికి ఎంత భక్తుడో ఈ పద్యాలు చదివితే తెలుస్తోంది కదా? ఇప్పుడు తనని శరణు కోరుతూ వచ్చిన దేవతలకి భగవంతుడు ఏమి చెప్తాడో వచ్చే నెల వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS